

# కామేశ్వరి ఖరీదెంత?

శ్రీధర

ఒక పెద్దమనిషి నాతో పనుంది రమ్మని టెలిగ్రాం యిస్తే, ఎన్నడో చచ్చిపోయిన మా నాయనమ్మ నిన్ననే చచ్చిపోయిందని మా ఆఫీసరుతో అబద్ధమాడి పదిరోజుల శలవు సంపాదించి పడుతూ, లేస్తూ మద్రాసువెళ్ళాను. తీరా నేను అక్కడికి వెళ్ళేటప్పటికి, ఆ పెద్దమనిషిని మరో పెద్దమనిషి పిల్చాడని బొంబాయి వెళ్లాడట. ఎప్పుడొచ్చేదీ తెలీదుట.

నేను గొప్ప పరేషాన్ లో పడిపోయ్యాను. వెళ్ళి శలవు రద్దుచేసుకునేందుకూ లేదు. నిష్కారణంగా ఈ మద్రాసు రోడ్లపొడవు కొల్చేందుకూ లేదు. మళ్ళీ ఇప్పట్లో శలవు యిమ్మంటే ఘనత వహించిన మా ఆఫీసువాళ్ళు ఇవ్వలేరు గనుక యీ సమయాన్ని సద్వినియోగం చేద్దామని ఆలోచన కలిగింది.

అప్పుడు నాకు మా మామయ్య ఊరు గుర్తొచ్చింది. ఒకసారి వెళ్ళి చూడాలని మనసు ఉబలాటపడింది, ఇంకేం, బండి ఎక్కాను.

అయిదారేళ్ళక్రిందట ఆ ఊరిమీద నాకు అసహ్యం పుట్టి హైద్రాబాదు వెళ్ళిపొయ్యాను. పాతజ్ఞాపకాలనూ, పీడకలలనూ గుర్తుచేసే ఆ ఊళ్లోకి తిరిగి రాగూడదనే అనుకున్నాను.

కానీ మా మిలటరీ మామయ్యను చూసి చాలాకాలమైంది. మామయ్యకూ నాకూ మధ్య పదేళ్ళ వ్యత్యాసమున్నా, మా యిద్దరిమధ్యా చిన్నప్పుడు చాలాగట్టి స్నేహం ఉండేది. స్కూలు ఎగ్గొట్టించి మధ్యాహ్నపు సినిమాలకు తీసుకెళ్ళటం, దొంగతనంగా ఊరిబయటికి తీసుకెళ్ళి కాలవలో ఈత నేర్పటం, అవసరానికి అప్పుడప్పుడూ చిల్లర డబ్బులు యిస్తూ, ఉండటంలాంటి వెన్నో చేస్తూ వుండేవాడు. ఆ రోజుల్లో మా మామయ్య నాకు నేస్తం, గురువు, ఫిలాసఫర్, గైడ్ అన్నీను. నిజంగానే మా మామయ్య చాలా గొప్పవాడు. కోటబట్టే చదువుగూడా గబగబా పూర్తిచేసుకున్నాడు. కొన్నాళ్ళు మిలటరీలోపనిచేసివచ్చాడు. అప్పట్నించే ఆయన మిలటరీ మామయ్య అయినాడు.

చివరకు మళ్ళీ భూమి గుండ్రమేనని బయల్దేరిన చోటికే వచ్చి, ఆ ఊళ్లోనే డాక్టరుగా బోర్డు కట్టాడు.

నేను రిక్షాదిగి లోపలికి వెళ్ళేటప్పటికి వరండాలో చాలామందిరోగులు కూర్చుని ఉన్నారు. మామయ్య లోపల బిజీగా ఉన్నాడు. జవాను నావివరాలు అడిగాడు.

"తెనాలి కృష్ణుడు వచ్చాడని చెప్పు" అన్నాను. నన్ను మా మామయ్య అలానే పిలుస్తాడు.

నాపేరు వినగానే అందర్నీ వదిలేసి గబగబా నాదగ్గిరికి వచ్చాడు. భుజంమీద చెయ్యివేసి లోపలికి తీసుకెళ్లాడు. ఇల్లు, క్లినిక్ కలిపి ఒకటే డాబాయిల్లు తీసుకున్నాడు.

ఎదురుగా కూర్చుని విశేషాలు అడిగాడు. కాఫీ,టిఫెనుతెప్పించాడు. కాసేపు రెస్టు తీసుకో యిప్పుడే వస్తానని మళ్ళీ ముందుగదిలోకి వెళ్ళిపొయ్యాడు. నేను స్నానపానాదులు పూర్తిచేసుకుని, ఒక చిన్న కునుకుగూడా తీసి లేచాను.

మామయ్య తనపని అంతా పూర్తి చేసుకుని వచ్చేటప్పటికి హోటల్‌నుంచి కారియర్ వచ్చింది.

మామయ్యకు పెళ్ళి అయిందని విన్నానేగాని, ఇంతవరకూ ఆమెను చూడలేదు. అత్తయ్యను వరించి చేసుకున్నాడని, వాళ్ళిద్దరూ చాలా అందంగానూ, అన్యోన్యంగానూ ఉంటారని గూడా వార్తలు వచ్చాయి.

"అత్తయ్యను చూపించలేదు నాకు" అని అడిగాను.

"మొన్ననే పుట్టింటికి వెళ్ళింది" అన్నాడు గిన్నెలు విప్పుతూ.

"ఎనీథింగ్ స్పెషల్ ?"

"ఏమంత తొందర ?"

"మీకన్నా నాకు తొందర యెక్కువ గదా. నువ్వు కూతుర్ని కనాలి. అది పెరిగి పెద్దదవ్వాలి. లవ్వాడాలి. ఎంత కథ ఉందనుకున్నావేంటి ?...."

"ఇదివరకు లవ్వాడిన వాళ్ళందర్నీ ఏం చేసినట్లు ?" అని అడిగాడు మామయ్య అన్నం కలుపుకుంటూ.

"నేను శ్రీరామచంద్రుడ్ని"

"నీపేరు కృష్ణుడుగదరా...."

"కృష్ణుడుమాత్రం మంచివాడుకదా ? కొంచెం జాలిగుండెకలవాళ్ళందర్నీలోకం నిందిస్తూనే ఉంటుంది. ఏంచేస్తాంమరి?" అన్నాను నేను.

దానిభావం మామయ్యకు అర్ధమయినట్లుంది, నవ్వాడు. "నీ సమర్ధన బాగానే ఉందిగాని, ఇంతకీ మామీద నీకింత దయకలగటానికీ, ఉత్తరం ముక్కయినా రాయకుండా నువ్వొచ్చి పడటానికీ గల కారణం నే తెల్సుకోవచ్చా ?" అని అడిగాడు.

"కారణం ఏంలేదు, నిన్నుచూద్దామని వచ్చాను" అన్నాడు.

"ఇంకానయం, నారోగుల్ని చూద్దామని వచ్చానన్నావు కాదు" అన్నాడు మామయ్య మజ్జిగలాంటి పెరుగు కలుపుకుంటూ.

భోజనాలు పూర్తిచేసి, పడకగదిలోకి వచ్చాక మళ్ళీ అదేప్రశ్న వేశాడు. నేను అదే జవాబు చెప్పాను. ఇంకా అన్నాను గదా—

"ఇప్పుడీవూళ్లో నాకు నువ్వుతప్పయింకెవరున్నారు చూసిపోవల్సినవాళ్ళు"

"ఈ వీధిలోనే నాలుగిళ్ళ అవతల నీ మాజీప్రేయసి కామేశ్వరి ఉంటుందన్న విషయం నువ్వీ జన్మకి మర్చిపోలేవన్న సంగతి నాకు బాగా తెల్సు."

"ఇప్పుడెందుకు గతాన్ని తవ్విపోసుకోవటం ?"

"ఇప్పుడంతకన్నా మనకు పెద్దపనేం ఉంది ? కానీ, వొరేయ్ కృష్ణా, నువ్వు దాన్ని వొదిలించుకోవటం మంచిదే అయిందిరా ?" అన్నాడు సిగరెట్టు పొగ వొదుల్తూ.

నేను కొంచెం నిరసనగా చూశాను. అందుకు మళ్ళీ నవ్వాడు.

"నీకెందుకా కోపం ? దాన్నియిప్పుడీవూళ్లో అంతకన్నా గౌరవించి యెవరూ మాట్లాడరు ?"

"ఏం ఎందుకని ?"

"నువెళ్ళిపొయ్యాక కొంత గ్రంథం నడిపింది. ఎక్కడినుంచో వచ్చాడు ఒక హైస్కూలు టీచరు. వాడితో బాగా పరిచయం పెంచుకుంది. వాళ్ళిద్దరూ పెళ్ళి చేసుకుంటారని చాలామంది అనుకున్నారు. తర్వాత యింకా పెళ్ళెందుకూ అందరికీ తెల్సిపోయింది కదా అనిగూడా అనుకున్నారు...."

నేను వెంటనే అందుకున్నాను. "లోకం అంతే మామయ్యా. ఇదుగో పులి అంటే, అదిగో తోక అంటారు. నిజ నిజాలు తెల్సుకునే ఓపిక యెంతమందికి ఉంటుందంటావు ?" అని అడిగాను.

మామయ్యమళ్ళీ నన్నుచూసినవ్వాడు. "నీ గుండె మళ్ళీ జాలితో కరిగిపోతోంది....కానీ, కామేశ్వరి ఆ టీచరుతోనో, మరో వెంకయ్యతోనో సంబంధం పెట్టుకున్నదన్నమాట మాత్రంఖాయం." అన్నాడు.

"నువ్వంత ఖాయం చెయ్యటానికి నీకున్న ఆధారమేమిటి ?"

"నువ్వు ఆవేశపడకు. నేను డాక్టర్ని. నెలతప్పిందని నాదగ్గరికి పరుగెత్తుకొస్తే, పాపమో, పుణ్యమో, చేతులు కడిగి పంపించాను."

నేను నిరుత్తరుడయ్యాను. ఇంకేం మాట్లాడను ? నాకెంత సంబంధంలేదనుకున్నా ఏదో తెలియని బాధ గుండెల్లో వికారంనా తిరిగినట్లయింది. యవ్వనం తరుముకెడుతూ ఉంటే; ఆ కాసేపూ, కళ్ళుమూసుకుపోతాయి మరి.

"రోజూ మనధగ్గరకువస్తూనేవుంటుందిలే. సాయంత్రం పలకరించు. ఏమంటుందో చూడు." అని అటు తిరిగి పడుకున్నాడు.

నేను పడుకున్నానుగాని, నాకు నిద్ర పట్టలేదు. నాకు పగటినిద్ర అలవాటు లేదు. పైనా ఇందాకనే కాసేపు పడుకుని లేచాను. పైగా కామేశ్వరి గురించి ఇలా విన్నాను. మనసంతా వికలమైపోయింది.

సాయంత్రమైంది. మామయ్య క్లినిక్‌లో బిజీనా ఉన్నాడు. నేను ముందున్న ఖాళీస్థలంలో కుర్చీ వేయించుకుని, ఏదో పుస్తకం చేతిలో పట్టుకుని, నాముందునుంచి వస్తూపోతూ ఉన్నవాళ్ళని చూస్తూ కూర్చున్నాను.

కాసేపటికి ఓ ఆరేళ్లపాపని వెంటబెట్టుకుని కామేశ్వరి వచ్చింది. నన్ను చూసి, ఆగి, నవ్వి, బావున్నావా అని అడిగింది. నేనూ పరామర్శించి ఊరుకున్నాను.

లోపలికి వెళ్ళింది. పది నిముషాల తర్వాత బయటికొచ్చింది. వెళ్తూ, వెళ్తూ నాదగ్గరకొచ్చి ఆగి ఏదో మర్చిపోయినట్లుగా నటించి పాపను లోపలకుపంపించింది.

"ఉంటావా నాలుగురోజులు ?" అని అడిగింది.

"ఊఁ"

"నీతో కాసేపు మాట్లాడాలి. ఒకపావు గంట తర్వాత అలా కాలవ ఒడ్డుకు వస్తావా ?" అని అడిగింది.

నేను కాదనలేకపోయినాను. కామేశ్వరి వెళ్ళిపోయింది.

అలా కాసేపు చల్లగాలికి తిరిగొస్తానని మామయ్యతో చెప్పి కాలవ ఒడ్డుకి నడిచాను. అనుకున్నట్లుగానే కామేశ్వరి వచ్చింది.

ఇప్పుడు దగ్గరగా చూసే అవకాశం కలిగింది. ఇదివరకటికన్నా బాగా లావయింది. వయసుతోవచ్చినలావణ్యం గూడా తోడై, మరింత అందంగావుంది. కానీ ఆ నొక్కుల గిరజాల జడ యింకా అలాగే బెత్తెడు పొడుగునేవుంది.

"నామీద కోపం తగ్గిందా కృష్ణా ?" అని అడిగింది.

నేను చిన్నగా నవ్వాను. "నీమీద కోపం రావటానికి నువ్వేం చేశావని ? నా ఆస్తి నువ్వేమన్నా దోచుకున్నావు గనకనా ?"

"ఒకరకంగా నువ్వు కోరుకున్న ఆస్తిని, అందాన్నీ, ఆనందాన్నీ నీకు కాకుండా చేశానని...."


"అందులో నీతప్పేంవుంది. నేను నిన్ను కోరుకోవడం సహజమేకదా."

కామేశ్వరి వెంటనే ఏమీ మాట్లాడలేదు. మేం ఇద్దరం కాలవ ఒడ్డున పొగడచెట్టుక్రింద కూర్చుని వున్నాం. చీకట్లు వలయాలు మమ్మల్ని చుట్టుముట్టేస్తున్నట్లు అనిపిస్తున్నది. ఆమె నిశ్చలంగా నున్న నీటివంక చూస్తూ అన్నది.

"వజ్రాన్ని పారేసుకుని, గాజు పెంకుల్ని ఏరుకున్నట్లు అయింది నాపని అప్పుడు నువ్వు కోరితే కాదన్నాను. తర్వాత నేను....డాక్టరుగారు నీకేమన్నా చెప్పారా ?"

"ఏవిషయం ?"

"....నాగురించి...."




"అసలు నీమాటే రాలేదు. దేనికి?" అని అవసరార్థం బొంకాను.

"ఏం లేదు" అని కాసేపు మళ్ళీ మౌనం వహించింది. కాసేపటికి నేనే మెల్లిగా అన్నాను.

"మనిషి తప్పులు చెయ్యటం సహజమే కామేశ్వరీ. చేసింది తప్పు అని తెల్సిన తర్వాత, సరిదిద్దుకునే ప్రయత్నం చెయ్యటంగూడా లోకసహజమే. మనమేం మానవాతీతులం కాదుగదా, జరగబోయే దేమిటో ముందుగా తెల్సుకుని జాగ్రత్త పడటానికి... ?"

కామేశ్వరి పొగడచెట్టు మానుకు ఆనుకుని కూర్చుని సన్నగా నిట్టూర్చటం వినిపించింది. ఎంతగుచ్చి చూసినాముఖకవళికలు స్పష్టంగా కనిపించటంలేదు. ఏదో నూతిలోనుంచి మాట్లాడినట్లుగా నీరసంగా ఉంది.

"మావాళ్ళు నాకు పెళ్ళి సెటిల్ చేశారు, కృష్ణా"

"చాలా సంతోషంగా అంది కామేశ్వరి."

"ఆ పెళ్ళికొడుకును చూశాక నాకే మాత్రం సంతోషం కలగలేదు. నాకు అంతకన్నా మంచి సంబంధం రాదని మావాళ్ళ వాదన...."

నాకేం మాట్లాడటానికీ తోచలేదు. కొద్దిగా వెన్నెల తొంగి చూస్తున్నది. మధ్య మధ్య నాకు దగ్గరగా కూర్చున్న అపరంజిబొమ్మ సౌందర్యాన్ని గూడా చూస్తున్నాను.

ఒకనాడు యీ కామేశ్వరితో పది నిమిషాలు ఒంటరిగా మాట్లాడే అవకాశం కోసం తహతహలాడాను. అప్పట్లో అలాంటి అవకాశం యెప్పుడన్నా తారసపడ్డా, కామేశ్వరి మాటలు తుంచేసి వెళ్ళిపొయ్యేది. ఆ రోజుల్లో తనమీద తనకే ఎందుకో తెలియని అహంభావంవుండేది. బహుశా ప్రతి బాలికా, కన్యగా మారిన కొత్తలో అలాంటి అహంభావం పెంచుకుంటుందేమో ?

ఇప్పటి కామేశ్వరిలాగే, అప్పుడు నేనూ గుండెకు తగిలిన గాయాన్ని ఎవరికీ కనిపించనివ్వకుండా యెంతో నేర్పుగా ఓర్పు వహించాను. కానీ ఆడపిల్ల జీవితానికి తగిలిన గాయం ఎద్దు పుండులాంటిది. లోకులనే కాకులు అస్తమానం ఆ గాయాన్ని పొడుస్తూ పెద్దది చేస్తూ వుంటారు.

"నువ్వు నాకోసాయం చెయ్యాలి, కృష్ణా" అన్నది కామేశ్వరి ఉన్నట్లుండి.

"ఏమిటో చెప్పు కామేశ్వరీ, సంతోషంగా చేస్తాను"

"కుదిరిన సంబంధం చెడగొట్టాలి. నాకు పెళ్ళికాకపోయినా ఫరవాలేదు. కానీ ఆ నీగ్రోవాడ్ని నేను భరించలేను.

ప్రతిరోజూ యెదురయ్యే అచిత్రహింసను తల్చుకుంటే, నాకు భయంవేస్తోంది. ఏదో ఒకటిచేసి ఈ సంబంధాన్ని చెడగొట్టు. నీకు పుణ్యం ఉంటుంది.

"ఈపని నావల్ల కాదు."

"ఇంతకుముందేగదా, సంతోషంగా చేస్తానన్నావు."

"ఇంతకుముందేగదా, సంతోషంగా చేస్తానన్నావు."

"నీ జీవితం కుదుటపడేందుకు ఏపనైనా సంతోషంగా చెయ్యగలను కాని, ఇలాంటి దౌర్భాగ్యపు పని నేను చెయ్యగలనని నువ్వెలా ఊహించావు, కామూ...."

"అది కాదు...." కామేశ్వరి ఏడుపులోకి దిగింది.

"నువ్వు చెప్పదల్చుకున్న దీ విషయమే అయితే, యింకొక్కక్షణంగూడా నేనిక్కడ ఉండను." అంటూ లేచి నిలబడ్డాను.

"వెళ్ళిపోకు. చీకటి...." అంటూ చప్పున నాచెయ్యి పట్టుకుంది. నెమ్మదిగా తనూ లేచింది.

"తల్లీ దండ్రీ దగ్గరనుంచీ అందరూ- మనుష్యులందరూ నాకు అన్యాయమే చేశారు. ఇందాక నిన్ను చూశాక, భగవంతుడు నాకోసమే నిన్ను పంపించాడని కాసేపు సంతోషపడ్డాను. ఈ కామేశ్వరి మీద నీకు అంతరాంతరాల్లో ఏమూలో నీకు తెలియకుండానే కాస్తంత జాలి మిగిలి ఉంటుందని ఆశించాను. కానీ నా అదృష్టం బాగాలేదు. నీకూ నామీద కనికరం కలగలేదు...." అంటూ కన్నీళ్ళు పైటకొంగుతో తుడుచుకుంది.

"నన్ను మన్నించు. నీవు కోరుతున్నది యెంత అసంగతమైన విషయమో యిప్పటి యీ ఆవేదనలో నీకు తెలియదుగాని, మరోరెండేళ్ళుపొయ్యాక అప్పుడు తెలుస్తుంది...." అన్నాను.

ఏమనుకున్నదో ఏమో నెమ్మదిగా నడవటం మొదలు పెట్టింది. నేనూ పక్కనే నడుస్తున్నాను. చీకట్లో దారి సరిగ్గా కనిపించక తూలి పడబోతే పట్టుకున్నాను కూడా. కానీ నాకు ఒక స్త్రీని ముట్టుకున్న అనుభూతే కలగలేదు. ఆ క్షణంలో.

నెమ్మదిగా నడుస్తూ ఊళ్ళోకి వచ్చాం. మా వెనకనే నడుస్తూ వస్తున్న యిద్దరు కుర్రాళ్ళు మాకువినపడేటట్లుగా మాట్లాడుకున్నారు.

"దీని ఖరీదెంతరా ?"

కామేశ్వరి రోషంగా వెనక్కి తిరిగి చూసింది. వాళ్ళు యింకా సంభాషణ పొడిగించారు.

"ఈ సైకిల్ ఖరీదెంతరా ?"

"అబ్బే, ఇది మన సొంతంకాదు. అద్దెకు తెచ్చాను."

"గంట కెంత ?"

"ఆ, చాలా చౌకలే, దొక్కుది"

ఎవరో తరుముకొస్తున్నట్లు కామేశ్వరి గబగబా నడిచి వీధిమలుపు దగ్గర నావద్ద శలవు తీసుకుని వెళ్ళిపోయింది.

ఇంటికి వెళ్లేటప్పటికి మామయ్య ఖాళీగా కూర్చునివున్నాడు. నాకోసమే యెదురుచూస్తున్నాడు.

"ఎక్కడికి వెళ్లావురా ?" అని అడిగాడు.

"ఊరికే, అలా చల్లగాలికి...."

"పిల్లగాలి తగిలిందా ?"

నేను నవ్వు ఆపుకుంటూ చూశాను. తనే యింకా అన్నాడు. ఏమంటుంది, నీ కాముడు ?"

"నీకెలా తెల్సు ?"

"తాతకు దగ్గులు నేర్పటమంటే యిదే. ఇంతకీ ఏమందేమిటి ?"

"త్వరలో పెళ్ళి కాబోతుందిట.

"ఆమాట చెప్పటానికి అంతదూరం తీసుకువెళ్లాలా?"

"కానీ మామయ్యా, ఆ సంబంధం తనకి యిష్టంలేదుట."

"నిన్ను చేసుకోమంటుందా ఏమిటి?"

"చేసుకుంటే ఏం మామయ్యా ?"

"నీ నాలిక కోసేస్తాను....దానికి లేకపోతే నీకయినా సిగ్గు ఉండక్కర్లా. ఇవ్వాళ రోడ్డుమీద కుర్రాళ్ళంతా, కామేశ్వరి ఖరీదెంత అని చర్చించుకుంటూ నవ్వుకుంటుంటే, ఇది మనవాళ్ల పిల్ల అని చెప్పుకోవటానికే నామర్దాగా ఉంది...."

నేనేం మాట్లాడలేదు. వింటూ ఊరుకున్నాను. తనే అన్నాడు.

"ఈ ఆశయాలూ, ఆదర్శాలూ ఒకరికి చెప్పటానికి బాగానే ఉంటాయిగాని అవి మనదాకా వచ్చేటప్పటికి భరించటం కష్టం. నమ్మకస్తురాలి కాని భార్యవల్ల భర్తపడే బాధకన్నా నరకం మరొకటి లేదు....పైగా నువ్వు కోరుకున్నప్పుడు తను కాదన్నది యింత జరిగాక ఇప్పుడు నిన్ను మళ్లీ దువ్వితే అర్థం ఏమిటి ?"

"ఇంక ఆపు మామయ్యా. నేను ఆ కామేశ్వరికోసం,మతిపోగొట్టుకుని పిచ్చివాణ్ణి కావటంలేదు."

"మరి మంచి సంబంధం చూడమంటవా నీకు ?" అన్నాడు నవ్వుతూ.

"థాంక్స్, అక్కర్లేదు." అని లేచి ముహం కడుక్కోవటానికి వెళ్లిపొయ్యాను.

ఇంక అక్కడ నాకు ఉండబుద్ధి కాలేదు. నేను వచ్చేటప్పుడు యివేమీ ఊహించలేదు. ఊరికే సరదాగా చూసిపోదామని వచ్చాను. వచ్చినప్పటినుంచీ యీ మనస్తాపాన్ని కొనితెచ్చుకున్నట్లయింది. మామయ్య చెప్పింది పూర్తిగా కొట్టెయ్యటానికి వీల్లేదు. మరి నేను కామేశ్వరికి ఏవిధంగానూ సాయంచెయ్యలేకపోయినప్పుడు, ఆదుకోలేకపోయినప్పుడు, కుదిరిన పెళ్లి చెడగొట్టటం దారుణం.

ఇక మిగిలిన విషయం ఒక్కటే. పెళ్ళికొడుకు కామేశ్వరికి నచ్చలేదు. దానికి నేనేం చెయ్యగలను? అయినా ఎంతమంది ఆడపిల్లలు ఇవాళ నిజంగా తమకు నచ్చిన వాళ్ళనే చేసుకో గలుగుతున్నారు? ఇష్ట పడకపోయినా, కష్టపడుతూనయినా కాపరాలు చేసుకుపోవటం మన సమాజంలో మామూలు విషయమే గదా? అయితే ఇంక ఇందులో ఆలోచించాల్సిం దేముంది? ఉంది.... లేదు....ఉన్నా, లేకున్నా ఇంక నా జోక్యం అనవసరం,

మర్నాడు వెళ్తానని బయలేరితే మామయ్య ఏదో మాట వరసకి ఇంకో రెండురోజులు ఉండిపోరా అన్నాడు. నేను మళ్ళీ ఇంకోసారి ఎప్పుడన్నా వస్తానులే అని చెప్పి వచ్చేశాను.

తర్వాత ఒక నెలరోజులకు కామేశ్వరి పెళ్ళి తిరపతిలో చేస్తున్నారని బంధుమిత్ర సకుటుంబ సపరివారంగా తరలి రమ్మని శుభలేఖ వచ్చింది. గ్రీటింగ్స్ పంపి ఊరుకున్నాను.

మళ్ళీ కొన్ని నెలల తర్వాత మామయ్య ఏదో ఉత్తరం రాస్తూ ఇప్పుడు కామేశ్వరి హైదరాబాదులోనే ఉంటోందని, ఈమధ్య ఇక్కడికి వచ్చినప్పుడు నాగురించి అడిగిందని, తీరినప్పుడు ఒకసారి వెళ్ళిచూసి రమ్మని రాశాడు. వెళ్ళటానికి నాకు మనసొప్పక మానేశాను.

నాతోపాటు మా ఆఫీసులో పని చేస్తున్న నేస్తం ఒకతను ఏదో పార్టీ ఇస్తానని వాళ్ళింటికి లాక్కెళ్ళాడు. ఆ ఇంట్లో క్రింద అన్నీ కలిపి ఒక అరడజను గదులున్నాయి. ఒక్కో గదిలో ఒక్కో కుటుంబం కాపురం ఉంటోంది. పైకి మెట్లెక్కబోతుంటే ప్రక్కనే ఉన్న గదిగుమ్మంలోంచి నిలబడ్డ కామేశ్వరిని చూసి ఆశ్చర్యపొయ్యాను. పది నిముషాల్లో వస్తానని మా స్నేహితుడికి చెప్పి నేను కామేశ్వరి గదిలోకి వెళ్ళాను.

నన్ను చూస్తూనే నవ్వుతెచ్చి పెట్టుకు లోపలికి ఆహ్వానించింది. స్టూలు ముందుకు జరిపి కూర్చోమంది. ఆగదిలో ఒక్కటయినా కాస్త ఖరీదైన వస్తువు కనిపించలేదు. ఒక మూల రెండు రేకు పెట్టెలు. ఒక చాప. దండెం మీద రెండు చీరలూ వగైరా గోడమీద రెండు మూడు ఫొటోలు వేళ్ళాడు తున్నాయి. మొగుడూ పెళ్ళాం కలిపి తీయించుకున్నవి.

"ఇన్నాళ్ళకి మళ్ళీ దయకలిగింది" అన్నది కామేశ్వరి నవ్వుతూ,

ఇప్పుడామె ఒట్టి మనిషి కాదు. ఇంకో రెండుమూడునెలల్లో తల్లి కాబోతుంది. ఆ భారం ఆమె ప్రతి కదలికలోనూ కనిపిస్తోంది

"పైన సత్యం అని మా ఫ్రెండ్ ఉన్నాడు. అతనితో వచ్చాను. మీ వారు ఎప్పుడొస్తారు?" అని అడిగాను.

"బాగా పొద్దుపోతుంది" అని ఊరుకుంది. అతని ఉద్యోగం గురించి వివరాలు అడిగాను, ఏదో ప్రైవేటు కంపెనీ పేరు చెప్పింది.

ఇంకో అయిదునిముషాలు కూర్చుని లేచి నిలబడ్డాను.

"కాఫీ తాగి వెళ్దువుగాని...." అని అన్నది. తనూ లేచి నిలబడి. ఏదో మొక్కుబడి కోసం ఆ మాట అన్నదే గాని, ఆ ప్రయత్నమేమీ ఆమె చెయ్యలేదు.

"ఇంకోసారివస్తానులే...." అన్నాను

కామేశ్వరి జీవితంలో ఇప్పుడు సుఖపడుతోందా, కష్టపడుతోందా అన్న ప్రశ్నకు నాకు సరైన సమాధానం దొరకలేదు. సుఖపడటం లేదని కనపడుతూనే ఉంది. ఇకపోతే కష్టపడుతోందా లేదా అన్న విషయం ఈ అయిదు నిముషాల్లో మాట్లాడిన మూడు ముక్కలను బట్టి తేల్చటం కష్టం. బీదరికంలోనూ తృప్తిగా బ్రతుకుతున్నవాళ్ళు ఉన్నారు మరి.

మా నేస్తం దగ్గరినుంచి కామేశ్వరికి సంబంధించిన విషయాలు తెల్సుకోవటానికి ప్రయత్నించాను. అతను ఆమెను ప్రేమగానే చూసుకుంటాడని అతను చెప్పాడు.

కొన్నిరోజులు వెళ్ళాక సత్యం ఒక కబురు పట్టుకొచ్చాడు. కామేశ్వరికి పిల్లాడు పుట్టిపోయినాడని ఆమె గూడా చాలా బలహీనంగా ఉందని, నిన్నొకసారి రమ్మని చెప్పమన్నదనీ గూడా చెప్పాడు. నేను వేరే తొందరపనుల్లో పడిపోయి నాలుగయిదు రోజుల్లో వెళ్దామని అనుకున్నాను.

కానీ ఒకరోజు వస్తూనే సత్యం పిడుగులాంటి వార్త పట్టుకొచ్చాడు. కామేశ్వరి చనిపోయిందిట. నేను నివ్వెరపోయాను, ఏదో జబ్బుచేసిందని బలహీనమైపోయిందని, నెత్తురు తక్కువయిపోయిందని, ఏమిటేమిటో చెప్పాడుట కామేశ్వరి మొగుడు. అతన్ని ఇంతవరకు నేను చూడలేదు. ఇప్పుడు చూడదల్చుకోలేదు గూడా.

పదిరోజులు గడిచాక సత్యం మరో వార్త పట్టుకొచ్చాడు. కామేశ్వరి మొగుడు ఆమెపేర యాభైవేల రూపాయలకు ఆర్నెల్ల క్రిందట ఇన్సూర్ చేశాట.

తిండికి జరిగీ జరగనివాడు భార్యపేర అంత పెద్దమొత్తానికి ఇన్సూర్ చెయ్యటంలో ఆంతర్యమేమిటి? ఇంతకీ కామేశ్వరిది సహజమైన చావేనా?

కామేశ్వరి ఖరీదెంత?